సాక్షి
కామారెడ్డి
శనివారం ¦ 20 ¦ ఏప్రిల్ ¦ 2024



అభివృద్ధి కోసమే కార్పొరేషన్లు

ప్రజల అభివృద్ధి కోసమే సీఎం కులాలవారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 9లో ▸



జోరుగా కుస్తీ..

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.1 /24.7

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెండో రోజు మూడు నామినేషన్లు

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం రెండో రోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తొలిరోజు కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలైన విషయం తెలిసిందే. రెండోరోజు స్వతంత్ర అభ్యర్థులు బిర్దార్ మారుతీరావ్, కమ్మరి ఆనందీశ్వర్ ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేయగా.. మఠం మహదేవ్ స్వామి రెండు నామినేషన్ సెట్లు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు నామినేషన్లను స్వీకరించారు.

24న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 24న ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఎంపిక టీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–100, 400, 600, 800, 1500, 5 వేల మీటర్ల విభాగాలలో బాల బాలికలు, మహిళలు, పురుషులకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మార్కుల జాబితా వెంట తీసుకురావాలని ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు.

క్రీడా శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని ఆయా గ్రామాల్లో వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు ఈనెల 22 లోగా కలెక్టరేట్‌లోని 223వ నంబర్ గదిలో సంప్రదించాలని సూచించారు. శిక్షణ ఇచ్చే వారికి రూ.4వేల గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 94402 92793, 96181 26053 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డి టౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తోట బాల్‌రాజు, ఉపాధ్యక్షులుగా హనుమండ్లు, వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా నక్క రవీందర్, రమేశ్, కార్యదర్శులుగా కాసర్ల రాజలింగం, రామారావు, స్పోక్స్ పర్సన్‌గా బీ.రమేశ్, కార్యవర్గ సభ్యులుగా నల్లనాగుల సురేశ్, రాజయ్య, యాదగిరిగౌడ్, బాల్‌రాజు, కిషన్, భూంరావు, రామారావు, ఎం.కిషన్, పూర్ణ చందర్, హనుమండ్లు, రాజు, మహేశ్, అమృత్‌రావు నియమితులయ్యారు.

పార్లమెంట్‌కు వెళ్లేదెవరో?









సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భవించాక మూడు పర్యాయాలు ఎన్నికలు జరగ్గా.. ఒకసారి కాంగ్రెస్, రెండుసార్లు బీఆర్ఎస్ విజయం సాధించాయి. మూడుసార్లూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీనే ఓటర్లు ఆదరించారు. నాలుగోసారి జరుగుతున్న ఎన్నికలలో ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారన్న అంశంపై అంతటా ఆసక్తి నెలకొంది. – సాక్షి, కామారెడ్డి

- 2008లో జహీరాబాద్ నియోజకవర్గం ఏర్పాటు
- తొలిసారి కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ఓటర్లు
- తెలంగాణ ఆవిర్భవించాక రెండు పర్యాయాలు బీఆర్ఎస్‌కే ఓటు
- మూడుసార్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకే మద్దతు
- ఈసారి ఎవరివైపో మొగ్గు..

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2008లో జరిగింది. అంతకుముందు మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బాన్సువాడ, జుక్కల్, మెదక్ జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, అందోల్, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలతో కలిపి జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గానికి తొలిసారి 2009లో ఎన్నికలు జరగ్గా.. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తన సమీప అభ్యర్థి మహాకూటమి అభ్యర్థి యూసుఫ్ అలీపై 17,407 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు 3,95,767 ఓట్లు రాగా, మహాకూటమి బలపరిచిన టీఆర్ఎస్ అభ్యర్థి యూసుఫ్‌అలీ 3,78,360 ఓట్లు సాధించారు. ఆ ఎన్నికలలో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి శివకుమార్‌కు 1,12,792 ఓట్లు వచ్చాయి.

- 2014 లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 1,44,631 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 5,08,661 ఓట్లు రాగా రెండోస్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు 3,64,030 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కె.మదన్‌మోహన్‌రావు 1,57,497 ఓట్లు సాధించారు.
- 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా రెండోసారి బరిలో దిగిన బీబీ పాటిల్ 6,229 ఓట్ల తేడాతో గెలుపొందారు. బీబీ పాటిల్‌కు 4,34,244 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి కె.మదన్‌మోహన్‌రావుకు 4,28,015 ఓట్లు, బీజేపీ అభ్యర్థి బాణాల లక్ష్మారెడ్డికి 1,38,947 ఓట్లు వచ్చాయి.

నాలుగోసారి ఎన్నికలు..

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాటయ్యాక నాలుగోసారి ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి సారి కాంగ్రెస్ గెలవగా.. తర్వాత వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ విజయం సాధించింది. ప్రస్తుతం నాలుగోసారి జరుగుతున్న ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ బరిలో దిగుతున్నారు. రెండు పర్యాయాలు టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ ఈసారి బీజేపీ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్ పోటీ చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలు ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచార బాధ్యతలు మోస్తున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిలు ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు.

- బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఆయన తరఫున కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అరుణతార, గంగారాం, యెండెల లక్ష్మీనారాయణ, పార్టీ నేతలు సుభాష్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. దేశ ప్రధానిగా మరోసారి మోదీని ఎన్నుకుందామని, జహీరాబాద్‌లో బీజేపీని గెలిపించి మోదీకి గిఫ్ట్ ఇద్దామని ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు.
- బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్ కుమార్ తరఫున బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ తదితరులు పార్టీ ప్రచార కార్యక్రమాలలో భాగమవుతున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహించి, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేశారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయితే ప్రచారం జోరందుకునే అవకాశాలున్నాయి.

పన్నెండేళ్ల కల నెరవేరింది

- ఆరేళ్ల శ్రమ ఫలితమిది
- ఐపీఎస్ ఆఫీసర్ కావాలన్న లక్ష్యంతో చదివా..
- చివరి ప్రయత్నంలో సక్సెస్ అయ్యా
- అమ్మానాన్నల త్యాగాలు మరువలేనివి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో సివిల్స్ విజేత రజనీకాంత్

సాక్షి ఇంటర్వ్యూ



సాక్షి, కామారెడ్డి: ''ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు ఏపీఆర్‌జేసీలో స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించా. నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ కాలేజీలో సీటు వచ్చింది. 2012లో డిగ్రీ చదువుతున్నప్పుడు వ్యాసరచన పోటీలో 'నా భారతం.. అమర భారతం' అన్న వ్యాసం రాయగా స్టేట్ ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. అందరూ దేశానికి ఉపయోగపడతావెంటూ మెచ్చుకున్నారు. ఐపీఎస్ కావాలని ఆరోజే నిశ్చయించుకున్నాను. పన్నెండేళ్ల నాటి కల ఇప్పుడు నిజం అయ్యింది'' అని సివిల్స్‌లో 587 ర్యాంకు సాధించిన ఆర్.రజనీకాంత్ పేర్కొన్నారు. ఆరో ప్రయత్నంలో విజయం సాధించానన్నారు. ఐపీఎస్‌కు సెలెక్ట్ అయిన రజనీకాంత్‌ను శుక్రవారం కామారెడ్డి కల్కినగర్‌లోని ఆయన ఇంట్లో 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా రజనీకాంత్ తన సక్సెస్ వెనక శ్రమను, తన కోసం కుటుంబం చేసిన త్యాగాలను వివరించారు. రజనీకాంత్ తెలిపిన వివరాలు..

కుటుంబ నేపథ్యం..

మా సొంతూరు రాజంపేట మండలంలోని అర్గొండ. మా నాన్న రామారెడ్డిపేట సిద్ధరాములు గంజ్‌లో గుమస్తాగా పనిచేశారు. ప్లంబర్‌గా, మెకానిక్‌గా, డ్రైవర్‌గా.. ఎన్నో వృత్తులు చేశారు. అమ్మ బీడీలు చుట్టేది. నాతోపాటు సోదరుడి కోసం వారు ఎంతో శ్రమించారు. చదువుల కోసం ఆస్తులు కూడా అమ్మారు. బాగా చదివి మంచి కొలువు సాధించు బిడ్డా అంటూ నిరంతరం ప్రోత్సహించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..

సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేందుకు 2018 సంవత్సరంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లాను. అక్కడే ఉండి చదువుకున్నాను. వరుసగా ఐదు ప్రయత్నాలు చేసినా సక్సెస్ రాలేదు. అయినా కుంగిపోలేదు. మరింత పట్టుదలతో చదివాను. తొలినాళ్లలో కోచింగ్ కోసం జాయిన్ అయినా అక్కడ నచ్చకపోవడంతో మానేశాను. సొంతంగా రోజూ ఎనిమిది గంటలు చదివాను. దాదాపు ఆరేళ్ల పాటు చదువు మీదే ధ్యాస పెట్టా. సివిల్స్ కొట్టాలన్న లక్ష్యంతోచదివాను. అపజయం ఎదురైనప్పుడు సమీక్షించుకుని, మళ్లీ ఆ పొరపాటు జరగకుండా ముందుకు సాగుతూ వెళ్లాను. చివరి ప్రయత్నంలో 587వ ర్యాంకు సాధించాను.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత

పోలీసులంటే సామాన్యుడు భయపడే పరిస్థితి పోయి ఫ్రెండ్లీ వాతావరణం ఏర్పడాలి. అంతేగాక సామాన్యుడు కూడా నేరుగా పోలీస్ ఉన్నతాధికారిని కలిసే పరిస్థితి ఉండాలి. నేను పోలీస్ అధికారినైతే అలాగే వ్యవహరించాలని అనుకునేవాడిని. శిక్షణ పూర్తి చేసుకుని, పోలీస్ అధికారిని అయ్యాక నేను కోరుకున్న పద్ధతిలో నడుచుకుంటాను. పేద, ధనిక, సామాన్యుడు, వీఐపీ అనే తేడా లేకుండా అందరినీ సమానంగా చూస్తా.

విద్యాభ్యాసం..

ప్రాథమిక విద్య కామారెడ్డి పట్టణంలోని వాసవి స్కూల్‌లో, అనంతరం పదోతరగతి వరకు మెదక్‌లోని కృష్ణవేణి స్కూల్‌లో చదివా. ఏపీఆర్‌జేసీ రాసి ఉమ్మడి రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించి నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశా. తర్వాత ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ బీఏ హిస్టరీ, హానర్స్ చదివా. ఇగ్నో యూనివర్సిటీ నుంచి ఎంఏ హిస్టరీ పట్టా సాధించా. యూజీసీ నెట్ కూడా పాసయ్యా. 2016 నుంచి 2018 వరకు హైదరాబాద్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో టీచింగ్ ప్రొఫెషన్‌లో పనిచేశా. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ స్కూళ్లలో టీచింగ్ ప్రొఫెషన్ కోసం నిర్వహించిన పరీక్షల్లో పాసై, రూ.11 లక్షల ప్యాకేజీతో అవకాశం వచ్చినా.. సివిల్స్ మీద ఆసక్తితో దాన్ని వద్దనుకుని ఢిల్లీ బాట పట్టా. పరుగు పందెంలో స్టేట్ లెవల్‌లో ప్రతిభ కనబరిచా. 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందాలలో స్టేట్ లెవల్‌లో పతకాలూ సాధించా. పోలీస్ ఆఫీసర్ కావాలనుకోవడానికి అథ్లెటిక్స్ మీద ఉన్న ఆసక్తి కూడా ఓ కారణమే..

ఎంతో సంతోషంగా ఉంది

పిల్లలు ఉన్నతంగా ఎదగాలని అందరు తల్లిదండ్రుల్లాగే మేమూ కోరుకున్నాం. వాళ్ల చదువులకు ఏ లోటూ రాకుండా చూశాం. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుంటే అప్పులు చేసి కూడా సర్దుబాటు చేశాం. మా ఆశలకు తగ్గట్టుగా మా వాడు మంచి ప్రతిభ కనబరిచాడు. సివిల్స్‌కు ఎంపికైనందుకు సంతోషంగా ఉంది.

– పద్మ, సిద్ధరాములు, రజనీకాంత్ తల్లిదండ్రులు



చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరై నూతన చైర్‌పర్సన్‌ను ఆశీర్వదించారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ బల్దియాలో అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉంటామని చైర్‌పర్సన్ ఇందుప్రియ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, నాయకులు గడ్డం చందు తదితరులు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌ను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

వడగళ్ల వాన బీభత్సం



సోమారంపేటలో వర్షంలో తడిసిన ధాన్యం

- తడిసిన ధాన్యం
- నేలకూలిన చెట్లు, విరిగిన విద్యుత్ సంభాలు
- కొట్టుకుపోయిన రేకులు

మాచారెడ్డి/రామారెడ్డి: మాచారెడ్డి, రామారెడ్డి మండలాలలో శుక్రవారం వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. సోమారంపేట, అంకిరెడ్డిపల్లి తండా, వెనుక తండా, అన్నారం తదితర గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. వరదనీటిలో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు మరింత నష్టపోయారు. మామిడి కాయలు నేలరాలాయి. సోమారంపేటలో ఒక ఇల్లు, అంకిరెడ్డిపల్లి తండాలో ఆరు ఇళ్ల రేకులు, అన్నారంలో ఓ ఇంటి రేకులు కొట్టుకుపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సోమారంపేటలో బూక్యా రవి అనే రైతు తన ట్రాక్టర్‌ను మామిడి చెట్టు కింద నిలపగా.. చెట్టు కూలడంతో ట్రాక్టర్ ధ్వంసమైంది.





సోమారంపేటలో గాలివానకు ట్రాక్టర్‌పై విరిగిపడిన చెట్టు, అన్నారంలో ఎగిరిపడ్డ రేకులు

'హోం ఓటింగ్‌ను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: హోం ఓటింగ్ ప్రక్రియను అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో హోం ఓటింగ్ ప్రక్రియపై పోలింగ్ బృందాలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోం ఓటింగ్ నిర్వహణపై పోలింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులతోపాటు అత్యవసర పౌర సేవలలో నిమగ్నమై ఉండే వారికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. అధికారులు రూట్ మ్యాప్ ప్రకారం ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సాధారణ పోలింగ్ తేదీకి ముందుగానే హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. శాసనసభ ఎన్నికలలో 500 మందికిపైగా ఈ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీవో ఏపీడీ మురళీకృష్ణ, డీఈవో రాజు, మత్స్య శాఖ ఏడీ వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు తప్పనిసరి..

ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం 85 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 23వ తేదీలోగా బూత్ స్థాయి అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 3 నుంచి 8వ తేదీ వరకు హోం ఓటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులు వినియోగించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలను ఉత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలల్లోని మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని, విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జూన్ 10లోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన పనులు పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీపీవో శ్రీనివాసరావు, ఆర్డీవో రఘునాథ్‌రావు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్ కుమార్, జ్యోతి, సరళ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు ఓటింగ్ యంత్రాలు..



ఈవీఎం గోదాం వద్ద పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ పాటిల్, అధికారులు

జిల్లాకు కేటాయించిన ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ నియోజకవర్గాలకు తరలిస్తున్నామని కలెక్టర్ పాటిల్ తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాం నుంచి ఈవీఎంల తరలింపు ప్రక్రియను శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలపై అపోహలను తొలగించి, పారదర్శకత తీసుకువచ్చేందుకు ఎన్నికల కమిషన్ ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టిందన్నారు. ఏ ఈవీఎం ఏ పోలింగ్ కేంద్రం పరిధిలోకి వెళ్తుందో ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ మాత్రమే నిర్దేశిస్తుందన్నారు. జుక్కల్ నియోజకవర్గానికి 318 చొప్పున బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 357 వీవీ ప్యాట్‌లు, ఎల్లారెడ్డికి 337 చొప్పున బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 378 వీవీప్యాట్‌లు, కామారెడ్డి నియోజకవర్గానికి 332 చొప్పున బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 372 వీవీప్యాట్‌లను కేటాయించామని తెలిపారు. మరో 199 బ్యాలెట్ యూనిట్లు, 147 కంట్రోల్ యూనిట్లు, 71 వీవీప్యాట్‌లను జిల్లా కేంద్రంలో రిజర్వ్‌లో ఉంచామన్నారు. ఓటింగ్ యంత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే గోదాముల్లో భద్రపరుస్తామని పేర్కొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

రామారెడ్డి: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పనులను జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన పోసానిపేట ప్రాథమిక పాఠశాల, రామారెడ్డి ప్రాథమిక, బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చిన్నచిన్న మరమ్మతులు వెంటనే చేపట్టాలని, తాగునీరు, టాయిలెట్స్ వంటి వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ సుష్మారెడ్డి, ఏఈ ఆనందం, ఎంఈవో యోసెఫ్, పాఠశాల హెచ్ఎంలు ఆనంద్, దేవ్లా, సీఆర్పీ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డి పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆరెపల్లిలో..

రాజంపేట: ఆరెపల్లి, ఆరెపల్లి తండాల్లోని స్కూళ్లను కలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డీఈ, ఏఈలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, హెచ్ఎంలు గంగామోహన్, రమేష్, డీఈ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూలమలుపుల పరిశీలన



కామారెడ్డి క్రైం : తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న కామారెడ్డి మండలం ఉగ్రవాయి ప్రాంతంలోని మూలమలుపులను శుక్రవారం పోలీసులు పరిశీలించారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రూరల్ పోలీసులు అర్అండ్బీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రామన్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను స్పీడ్ లిమిట్ బోర్డులను, తెల్లరంగు గీతలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్అండ్బీ డీఈఈ, ఎస్ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



పెద్దకొడప్గల్(జుక్కల్) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కరించడమే తమ లక్ష్యమని (సీజీఆర్ఎఫ్) చైర్మన్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్శాఖ ఉప కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బిచ్కుందకు చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ తీగలు చెట్లకు తాకడం వల్ల సరఫరా అంతరాయం ఉంటుందని వినతి పత్రాన్ని అందించారు. వినతి పత్రాన్ని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, విద్యుత్ మీటర్ రీడింగ్లను సకాలంలో తీయాలని విద్యుత్శాఖ అధికారులకు (సీజీఆర్ఎఫ్) చైర్మన్ రామకృష్ణ సూచించారు. ఫోరంలో కేసులు వేయడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన పనిలేదన్నారు. రైతులందరూ మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు బిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ రామేశ్వరరావు, ఏడీఈ బాలాజీ, పిట్లం ఏఈ బుజ్జి బాబు, నిజాంసాగర్ ఏఈ లక్ష్మణ్, స్థానిక ఏఈ సాయినాథ్ గౌడ్ పాల్గొన్నారు.

గ్రోమోర్ దుకాణానికి తాళం



బాన్సువాడ : బీర్కూర్ గ్రోమోర్ దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులు శుక్రవారం గ్రోమోర్ దుకాణానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. బీర్కూర్కు చెందిన పలువురు రైతులు గ్రోమోర్ దుకాణంలో ఆర్కే విత్తనాలు కొనుగోలు చేసి యాసంగి పంట సాగు చేశారు. పంట కోత దశలో పూర్తిగా పాల్లు పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతుల పంట పొలాలను పలువురు శాస్త్రవేత్తలు సందర్శించి నకిలీ విత్తనాలతోనే పంట నష్టం వాటిల్లిందని నివేదికలు అందించారు. నష్టపోయిన రైతులకు గ్రోమోర్ ఆధ్వర్యంలో నష్టపరిహారం అందిస్తామని దుకాణం యజమానులు హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు ఏ ఒక్కరికి నష్టపరిహారం అందించకపోవడంతో రైతులు గ్రోమోర్ దుకాణానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. నష్టపరిహారం చెల్లించే వరకు దుకాణాన్ని మూసి ఉంచాలని రైతులు పేర్కొన్నారు. బీర్కూర్లో సుమారు 500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

రెండో రోజు ఏడు నామినేషన్లు





ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

- బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా..
- ఇప్పటివరకు 8 మంది అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

సుభాష్నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్సభ నియోజకవర్గానికి సంబంధించి రెండోరోజు శుక్రవారం అరుగురు అభ్యర్థులు మొత్తం ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. వీరితోపాటు బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా రాపెల్లి శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా రాగి అనిల్, నామినేషన్ పత్రాలు సమర్పించారని రిటర్నింగ్ అధికారి వివరించారు. కాగా రెండు రోజులకు మొత్తం మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు.

బీఆర్ఎస్ అభ్యర్థి రెండు సెట్ల నామినేషన్

బీఆర్ఎస్ బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలుచేశారు. బిగాల గణేశ్గుప్తా కారు నడపగా, అభ్యర్థి బాజిరెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, వేముల ప్రశాంత్రెడ్డి, రాజ్యసభ ఎంపీ సురేశ్ రెడ్డితో కలిసి ఒక సెట్ నామినేషన్ వేశారు. మరో సెట్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్రెడ్డితో పాటు జగిత్యాల్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, బోధన్ బీఆర్ఎస్ ఇన్చార్జి అయేషా ఫాతిమాతో కలిసి దాఖలు చేశారు. బాజిరెడ్డి కుటుంబ సభ్యులతో నామినేషన్ కేంద్రానికి చేరుకున్నా.. ఈసీ నిబంధనల మేరకు వారు బయటే వేచి ఉన్నారు.

పసుపు రైతులతో కలిసి బీజేపీ అభ్యర్థి

బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పసుపు రైతులతో కలిసి మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మెడలో పసుపు కొమ్ముల దండ, స్వయంగా కారు నడుపుతూ అర్వింద్ నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం మీడియా పాయింట్లో విలేకరులతో మాట్లాడారు. పసుపు రైతుల సమక్షంలో, వారి ఆశీర్వాదంతో మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. పసుపు రైతులు సమకూర్చి ఇచ్చిన డబ్బుతో నామినేషన్ డిపాజిట్ చెల్లించానని, చాలా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైతులు పండించే పసుపు, వరి, మామిడి, మొక్కజొన్న, చెరుకు, ఇతరత్రా పంటలకు విత్తనాల నుంచి మార్కెటింగ్ సౌకర్యం వరకూ అన్ని చర్యలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయా పంటల ప్రాసెసింగ్, ప్యాకేజీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని, స్వయం ఉపాధి మహిళలకు వాల్యూయాడెడ్ సర్వీస్లో భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. దేశాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ హబ్గా మారుస్తామని, తద్వారా యువతకు ఉపాధి పెరుగుతుందని తెలిపారు. గల్ఫ్ వలసలు ఆపుతామని, అక్కడ ఉన్న వారందరికీ ఉపాధి కల్పించి వాపస్ వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పసుపు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్కో ఎస్ఈ రమేశ్బాబు

లింగంపేట(ఎల్లారెడ్డి) : విద్యుత్ శాఖ పరిధిలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో ఎస్ఈ రమేశ్బాబు సూచించారు. శుక్రవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, గాంధారి మండలాల డివిజన్ స్థాయి ట్రాన్స్కో ఉద్యోగుల సమావేశంలో పాల్గొని అవగాహన కల్పించారు. ఎన్పీడీసీఎల్ డీఎండీ ఆదేశాల మేరకు శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మండల, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా జరిగే విధంగా ఉద్యోగులు చూడాలని ఆదేశించారు. అలాగే ట్రాన్స్ఫార్మర్లు తరుచూ కాలిపోకుండా జాగ్రత్తలు చేపట్టాలని వివరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈలు వెంకటరంగయ్య, గణేష్, ఏడీలు సుదర్శన్రెడ్డి, తిరుపతిరెడ్డి, ఆరుగురు ఏఈలు, లైన్ఇన్స్పెక్టర్లు, లైన్మెన్లు, జూనియర్ లైన్మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పిట్లం(జుక్కల్) : మండలంలోని కంభపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బీజేపీ పార్టీ నాయకులు శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీజేపీ పార్టీ నాయకులు జగదీష్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకు ఓటు వేసి ఎంపీగా బీబీ పాటీల్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొరారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు అభినయ్రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వడ్ల శివ, నాయకులు ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని బంజరాహిల్స్ కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మేకల నరేశ్ తదితరులు తెలిపారు.



నిజాంసాగర్లో బీజేపీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

'అభివృద్ధిని చూసి ఓటేయండి'



మద్నూర్: దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార కోరారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జన సంపర్క్ అభియాన్ నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తున్నవారి వద్దకు వెళ్లి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ను గెలిపించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు తెప్ప తుకారాం, కృష్ణ పటేల్, సంతోష్, బాలకిషన్, సుధాకర్, దిలీప్ పటేల్ పాల్గొన్నారు.

కుస్తీ పోటీలో యువతులు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్నగర్ మండలంలోని నర్వ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కుస్తీ పోటీల్లో యువ మహిళ మల్లయోదులు పోటీ పడ్డారు. వరంగల్కు చెందిన రమ్య, మహబుబాద్కు చెందిన బాలమణి పురుషులతో సమానంగా కుస్తీ పోటీల్లో తలపడ్డారు. మహిళల కుస్తీ పోటీలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. మహిళా మల్లయోదులకు కుస్తీ పోటీల నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు.

రూ. 60వేల నగదు పట్టివేత



భిక్కనూరు: మండల కేంద్రంలోని టోల్ప్లాజా వద్ద పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో హైదరాబాద్కు చెందిన చందర్ హరి ప్రసాద్ వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 60వేలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్లో ముగ్గురికి జైలు

ఖలీల్వాడి: డ్రంకన్ డ్రైవ్లో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి సయ్యద్ ఖదీర్ విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 మందికి రూ. 17,600 జరిమానా విధించగా ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. శుక్రవారం కుటుంబ సభ్యులు నిద్రలేచే సరికి అమ్మాయి తన గదిలో కనిపించకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఐదుగురికి గాయాలు

మాక్లూర్: మండలంలోని ధర్మారంలో శుక్రవారం సాయంత్రం చలి పిడుగు తగిలి ఐదుగురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో గ్రామ శివారులో ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పేందుకు వెళ్లిన సుంకరి ధర్మారం, సుంకరి నారాయణ, బన్నీ, సాకలి శంకర్పై చలిపిడుగు పడింది. దీంతో వారికి తిముర్లు వచ్చి అపస్మారకస్థితికి చేరుకున్నారు. గమనించిన స్థానికులు వారికి చికిత్స నిమిత్తం అంబులెన్స్లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



గంగవ్వ

బాన్సువాడ రూరల్: బంధువుల విందుకు హాజరైన ఓ మహిళను మృత్యువు కబళించింది. కిరాణ దుకాణంలో పూజకు అవసరమయ్యే సామగ్రిని కొనుగోలు చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో అతివేగంగా వస్తున్న వాహనం సదరు మహిళను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బాన్సువాడ మండలం తాడ్కోల్లో చోటు చేసుకుంది. సీఐ మున్నూరు కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం కుర్తి గ్రామానికి చెందిన పోతరాజు గంగవ్వ(60) బాన్సువాడ మండలంలోని తాడ్కోల్లో తమ బంధువులు నిర్వహించిన కందూరు విందుకు శుక్రవారం హాజరైంది. పెద్దదేవుని దర్గాలో పూజకు అవసరమయ్యే సామగ్రిని కొనుగోలు చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో బాన్సువాడ వైపు వేగంగా వెళ్తున్న తుఫాను వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో గంగవ్వ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తమ్ముడు సాయిలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

మాచారెడ్డి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్సై రామేశ్వర్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గజ్జినాయక్ తండాకు చెందిన లక్ష్మణ్(36) గురువారం బహిర్భూమికని వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. మండల కేంద్రంలోని ఊర చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..

ఎడపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మంగళ్పాడ్లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీచందర్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలెపల్లి ఇంద్రజ(48)కు ముగ్గురు సంతానం. వీరు ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతక్రుదయం ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఇంద్రజ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



మోపాల్: మండలంలోని మంచిప్పకు చెందిన గాండ్ల భూదేవి (68) వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూదేవి తూనికాకు కోసం గురువారం కొండెం చెరువు సమీపంలో ఉన్న గల అటవీ ప్రాంతానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో గ్రామస్తులు ఆమె కుమార్తెలు, అల్లుళ్లకు సమాచారమిచ్చారు. శుక్రవారం భూదేవి కోసం అటవీ ప్రాంతంలో వెతుకగా ఓ చెట్టు కింద మృతిచెంది ఉంది. వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

టీచర్లు అంకితభావంతో పని చేయాలి



భవానీపేటలో ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మాచారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం పాల్వంచ మండలం భవానిపేట, భవాని పేటతండా పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తలుపులు, కిటికీలు, విద్యుత్ కనెక్షన్, పాఠశాల భవనాల పరిస్థితి ముఖ్యంగా మూత్రశాలల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ గుణాత్మక విద్యను అందించాలని కోరారు. ఎంపీడీవో గోపి బాబు, ఎంఈవో ఎల్లయ్య ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పాఠశాలను పరిశీలించిన కలెక్టర్



యాడారంలో పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

బీబీపేట : మండల కేంద్రంలోని యాడారం గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన నిధులతో పాఠశాలలో పనులను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్, మౌళిక వసతులను పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఆయన వెంట గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లో చేరిక



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ సమక్షంలో కాంగ్రెస్లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని నందివాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుర్రపు నారాయణతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు శబ్బీర్అలీ సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



తిప్పాపూర్ వాసులు..

కాంగ్రెస్లో తిప్పాపూర్ వాసులు..

భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. బీఆర్ఎస్ నేతలు కొండ మాసయ్య, విజయ, పెద్దగౌడ్స్వామి, బాలగౌడ్, వెంకటస్వామి, రవీందర్గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి పాల్గొన్నారు.

బోధన్-బీదర్ రైల్వే లైన్కు కృషి చేస్తా

- జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్



వర్నిలో మాట్లాడుతున్న సురేశ్ షెట్కార్

రుద్రూర్: బోధన్-బీదర్ రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. చందూర్, వర్ని, కోటగిరి మండల కేంద్రాల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం నిర్వహించిన పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు బోధన్-బీదర్ రైల్వే లైన్ సర్వే చేయించి ఎస్టిమేట్ వేయించానని, ఆ తర్వాత ఎంపీగా వచ్చిన బీబీ పాటిల్ దాని గురించి పట్టించుకోలేదన్నారు. సీఎం రేవంత్రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బోధన్ ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో పార్టీ బాన్సువాడ సెగ్మెంట్ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, పార్టీ మండలాల అధ్యక్షులు తోట అరుణ్కుమార్, సురేశ్బాబా, పుప్పాల శంకర్, షాహీద్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్తోనే ప్రజా సంక్షేమ పాలన



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే సాధ్యమవుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. నగర కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో సాలూర మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి ఆమె భర్త పార్టీ సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్, భవానీపేట మాజీ సర్పంచ్ కృష్ణ, 100 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బోధన్కు చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు, మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ సావిత్రి భర్త గంగాధర్ గౌడ్ కాంగ్రెస్లో శుక్రవారం చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్రావు, మందర్న రవి, నాయకులు గణపతిరెడ్డి, నరేందర్ రెడ్డి, నాయకులు ఇల్తెపు రమేశ్, కేజీ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ముగ్గురికి జైలుశిక్ష

ఖలీల్వాడి: బంగారు ఆభరణాలు దొంగిలించిన ఘటనలో ముగ్గురికి జైలు శిక్షను విధించినట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. డిచ్పల్లి మండలం సుద్దులంకు చెందిన నీరడి అరుణ్, నీరడి రాజమణి, రెంజల్ మండలం కుర్నాపల్లికి చెందిన కొండపల్లి సావిత్రి, కోటగిరి మండలం కల్లూరుకు చెందిన సాయిలు 2022 మే 8న నగరంలోని గౌతంనగర్లో ఉన్న బోయిని పోచమ్మ ఇంటికి వెళ్లి ఇల్లు అద్దెకు కావాలని ఇంట్లోకి ప్రవేశించారు. వీరు పోచమ్మపై ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించి గొంతు నులిమి హత్య చేశారు. నిందితులపై సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. విచారణలో అరుణ్, సాయిలు, రాజమణి దొంగతనం చేసినట్లు రుజువు కావడంతో వీరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు దొంగసొత్తు కలిగి ఉన్నందున మరో రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వేయి జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. కాగా పోచమ్మ పోస్టుమార్టంలో సహజ గుండెజబ్బుతో మృతి చెందినట్లు రిపోర్టు రావడంతో నిందితులపై హత్య నేరం కాకుండా దొంగతనం, దొంగసొత్తు కలిగి ఉన్నందున కేసు నమోదు చేసి శిక్షను విధించినట్లు జడ్జి పేర్కొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

రెంజల్: పూడ్చిపెట్టిన మృతదేహానికి కొల్లూర్ పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండలంలోని సాటాపూర్లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీరయ్య(48) బతుకుదెరువు కోసం హైదరాబాద్కు వలస వెళ్లాడు. అక్కడ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పని చేస్తున్న ప్రదేశంలో భవనంపై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనపై సైబరాబద్ కమిషనరేట్ పరిధిలోని కొల్లూర్ పీఎస్లో కేసు నమోదైంది. గాయపడిన గీరయ్యను కుటుంబీకులు గ్రామానికి తీసుకొచ్చి వైద్య చికిత్సలు అందించారు. ఇంటి వద్ద చికిత్స పొందుతూ 15 రోజుల క్రితం మృతిచెందాడు. కుటుంబీకులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న కొల్లూర్ పోలీసులు శుక్రవారం గ్రామానికి చేరుకొని కేసు విషయమై పూడ్చిపెట్టిన మృతదేహానికి డాక్టర్లు, ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖలీల్వాడి: నగరంలోని బోర్గాం(పి) శివారులో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దాడి చేసినట్లు ఎస్సై సంజీవ్ శుక్రవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు వ్యభిచార గృహంపై దాడి చేయగా ఓ విటుడు, విటురాలిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్వాహకురాలు పర్వీన్ బేగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.